క్లుప్తంగా

నేడు ప్రత్తిపాడు-3లో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు-3 సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ. శ్రీరమ్య తెలిపారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే పూర్తి చేసి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ప్రాథమిక పరీక్షలు చేశారని పేర్కొన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారంతా నేడు శిబిరానికి హాజరయ్యేలా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు చూస్తారని తెలిపారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తారని, ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పేద బ్రాహ్మణ విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



గుంటూరు రూరల్: పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ తెలిపారు. గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్‌లోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను, సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిపాక ప్రసాద్ ఆధ్వర్యంలో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న గుధిమెళ్ల తిరుమలమధులతకు రూ. 40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్ అందజేసినట్లు తెలిపారు. పొన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్ పులిపాక ప్రసాద్ సతీమణి గీతాదేవి జ్ఞాపకార్థం వారి పిల్లలు పృథ్వీకృష్ణ ,భావని ప్రతి ఏడాది వారి తల్లి పేరిట చేసే సహాయ కార్యక్రమాలలో భాగంగా ఈ ల్యాప్‌టాప్‌ను అందజేసినట్లు వివరించారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఏడాది నిరుపేద బ్రాహ్మణుల విద్యకు సహకారం అందిస్తున్నట్లు పులిపాక ప్రసాద్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌కు చెందిన 50 సంవత్సరాల చంద్ర రవికుమార్ ఈనెల 12వ తేదీ ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831343 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉపాధి హామీ పథకంతో జీవనానికి భద్రత

చేబ్రోలు: ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం వంద రోజుల వేతన ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంత కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించడం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశమని ఏపీవో ఆనంద్ మోహన్ తెలిపారు. మండలంలోని వడ్లమూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఎన్‌ఆర్‌జీఎస్ మేట్ల సమావేశంతో పాటు శిక్షణ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని వడ్లమూడి, గొడపాలెం, గరువుపాలెం ప్రాంతాలకు చెందిన మేట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏపీవో ఆనంద్ మోహన్ జాబ్ కార్డు పొందే విధానం, వాటి ఉపయోగం తదితర అంశాల్ని వివరించారు. పనిలోకి వచ్చిన వేతనదారుల సంఖ్యను బట్టి కనీస వేతనం వచ్చే విధంగా, ఏ రోజు పని ఆ రోజే పూర్తి చేసే విధంగా చూడాలని తెలిపారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ- శ్రమ్ ముఖ్యాంశాలు, ఫారం ఫాండ్‌ల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఎస్. సంపత్, పంచాయతీ కార్యదర్శి వై.పి.ఎ. ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

यूनियन बैंक | Union Bank

చేబ్రోలు బ్రాంచి, ... పొన్నూరు, గుంటూరు జిల్లా. ఫోన్ : 9321988842

బంగారు నగల వేలము నోటీసు

[illegible]

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు	మిశ్రమతూకం గ్రాముల్లో
037916540001101	[illegible]	89.00

తేదీ: 18-01-2024, ... [illegible]

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com

అభివృద్ధి చేశాం.. అండగా నిలిచి ఆదరించండి !

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



తక్కెళ్లపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలందరూ ఆదరించాలని, అండగా నిలబడి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కోరారు. మండలంలోని తక్కెళ్లపాడులో రూ. 1,51,94,000తో నిర్మించిన సచివాలయాలు, హెల్త్‌వెల్ నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, కమ్యూనిటీ హాలును గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. పీఎసీఎస్‌లో రూ. 5 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అగతవరప్పాడులో రూ. 78,60,000తో నిర్మించిన సచివాలయం, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామాలలోనే అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందుతున్నాయని తెలిపారు. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే సాకారమైనట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, మండల కో- ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ట్రస్టు బోర్డు చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, అగతవరప్పాడు సర్పంచి పిట్లు శివకృష్ణారెడ్డి, తక్కెళ్లపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ మేరిగ సుబ్బారావు, నాయకులు పెనుమాల అరుణ్‌కుమార్, గాలయ్య, సునందమ్మ, షేక్ ఖాసిం, కగ్గా శివయ్య, కూచిపూడి మాధవి, పేరం రాఘవులు, షేక్ అబ్దుల్ నబి, కుంచల అంజిరెడ్డి, ఆర్. గాబ్రేల్, షేక్ కరీముల్లా, కుంచల నారాయణరావు, షేక్ షబీనా సుల్తానా, వేముల శంకర్, పలువురు అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

- ఓటర్ల జాబితా పునఃపరిశీలించుకోవాలి
- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్



సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న శ్రీకర్

ప్రత్తిపాడు: తుది ఓటర్ల జాబితాను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్పులు, చేర్పులపై వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసిన తరువాతే నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే ప్రచురించామని తెలిపారు. జాబితాలు బీఎల్‌వోలు, పోలింగ్ బూత్‌లు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరోసారి ఆయా పార్టీల నాయకులు, ఓటర్లు జాబితాలను పునఃపరిశీలించుకుని ఆయన సూచించారు. అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఇద్దరు వ్యక్తులు ఓట్లు తొలగింపునకు 63 దరఖాస్తులు పెట్టారని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు తహసీల్దార్ జి. సిద్ధార్థ ఎస్‌ఐకు పిర్యాదు చేసినట్లు సమావేశంలో నాయకులకు తెలిపారు. అనుమానాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నామని శ్రీకర్ స్పష్టం చేశారు.

24 గంటలూ పని చేయాలి

ప్రత్తిపాడు బస్టాండు సమీపంలో సివిల్ సప్‌లైస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకును గుంటూరు ఆర్డీవో పి. శ్రీకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాత్రి సమయాల్లో పెట్రోలు కొట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఇరవై నాలుగు గంటలూ పెట్రోలు బంకు పనిచేయాలని, వినియోగదారులను ఇబ్బందులు పెట్టవద్దని బంకు ఇన్‌చార్జి అలేఖ్యకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న సివిల్ సప్‌లై గోడౌన్‌లో తనిఖీలు చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వెంట తహసీల్దార్ జి. సిద్ధార్థ తదితరులున్నారు.

క్రాఫ్ట్ రిసోర్స్ వర్క్‌షాప్‌కు ఉపాధ్యాయురాలి హాజరు



వర్క్‌షాపులో సర్టిఫికెట్‌ను అందుకుంటున్న పద్మ కోటి తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడతాయని నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ కోటి తెలిపారు. ఉదయ్‌పూర్‌లో గురువారం కల్చరల్ క్రాఫ్ట్ రిసోర్స్ సెంటర్‌లో సీసీఆర్‌టీ ఉదయ్‌పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన 97 మంది పాల్గొన్నారని, అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది హాజరయ్యారని తెలిపారు. అందులో తానుండటం సంతోషకరమన్నారు. వర్క్‌షాపులో సీసీఆర్‌టీ అందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కిట్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యతలు కలిగిన బోధన అందిస్తామని తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన డీఈవో శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూనకు కృతజ్ఞతలు తెలిపారు.

శేకూరులో వీవీఐటీ సేవా శిబిరం ప్రారంభం



ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీలో తహసీల్దారు గోపాలకృష్ణ, పీవో తదితరులు

చేబ్రోలు: మండలంలోని శేకూరులో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల (వీవీఐటీ) ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవా శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ నెల 24 వరకు వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, మెడికల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. మొదటి రోజు మహిళా సాధికారత, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఆడపిల్లలను గౌరవించాలని, వారిని చదువుల తల్లిగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. సమాజంలో దేనికీ తీసిపోరు అని రుజువు చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. యుక్త వయుస్సులో కలిగే ఆకర్షణలు లక్ష్యాలను దూరం చేస్తాయని , వాటికి యువత దూరంగా ఉండాలని చెప్పారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఐ.ఎల్.జె.భక్తసింగ్, బి.వి.సతీష్ కుమార్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ

చేబ్రోలు: గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని చేబ్రోలు మండల తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ 2023-24పై రెండు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. వివిధ అంశాలపై ఈవోపీఆర్డీ జి. శ్రీనివాసరావు, మండల పరిషత్ సూపరింటెండెంటు ఉమాదేవి, ఏపీవో వి. నాగేశ్వరరావు అవగాహన కల్పించారు.

అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేస్తున్న సీఎం జగన్

సీఎం జగన్‌కు అభినందనలు

పొన్నూరు: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్‌కు నివాళిగా విజయవాడ స్వరాజ్ మైదానంలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఆయన్ను గౌరవించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో శుక్రవారం వైభవంగా జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్, నాయకులు మల్లెల రాజు, వేముల మూర్తి రాజు, రూరల్ నాయకులు పిల్లి మాణిక్యరావు, ఎందేటి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్టు



గుంటూరు రూరల్: కోడి పందేలరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధిలోని ఓబులునాయుడుపాలెం శివారుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న స్పెషల్ బ్రాంచి పోలీసుల సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న 10 మంది, కోడితో పాటు రూ. 1.82 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- చారిత్రాత్మక ఘట్టంలో భాగస్వాములు కావాలి
- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్



సమన్వయకర్త కిరణ్ కుమార్

ప్రత్తిపాడు: విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరూ తరలివచ్చి, చారిత్రాత్మక ఘట్టంలో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ స్మృతి వనం దేశానికే గర్వకారణమని తెలిపారు. అలాంటి బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టిన సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో కనీవిని ఎరుగని విధంగా విజయవాడ స్వరాజ్ మైదానంలో 20 ఎకరాల్లో రూ. 400 కోట్లతో 206 అడుగుల ఎత్తున విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఇది ఆకాశమంత అంబేడ్కర్ ఆశయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నిలువెత్తు గౌరవమని పేర్కొన్నారు. విగ్రహంతో పాటు మల్టీ కన్వెన్షన్ హాల్, ఓపెన్ థియేటర్, లైబ్రరీ, ధ్యానం కోసం ప్రత్యేక హాల్, గ్రీనరీ ఏర్పాటు చేసి అద్భుతమైన కళాఖండంగా మైదానాన్ని ప్రభుత్వం తీర్చిదిద్దిందని వివరించారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంతోనే దేశంలో ప్రజలు స్వేచ్ఛగా, సమానత్వంగా ఉన్నారన్నారు. ప్రపంచంలో అంబేడ్కర్ స్థానం ఎంతో గొప్పదని, ఆయన మహోన్నత వ్యక్తి అని కిరణ్‌కుమార్ కొనియాడారు. పార్టీలకు, కులాలకు, మతాలకు, అతీతంగా విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పెద్దఎత్తున పాల్గొని ఆ మహనీయునికి గౌరవాన్ని మరింత ఇనుమడించాలని పిలుపునిచ్చారు.

ముట్లూరులో మందుబాబుల వీరంగం

సచివాలయం, ఎండీయూ వాహనం అద్దాలు ధ్వంసం



పగలగొట్టిన సచివాలయం కిటికీ అద్దాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మందుబాబులు వీరంగం సృష్టించారు. బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూటుగా మద్యం తాగి గ్రామంలోని సచివాలయం-1, సచివాలయం -2 కిటికీల అద్దాలు ధ్వసం చేశారు. అంతటితో ఆగకుండా గ్రామంలో నిలిపి ఉంచిన ఎండీయూ వాహనం అద్దాలను సైతం పగలగొట్టారు. ఇది మందుబాబుల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గురువారం ఉదయం సచివాలయం తీసేప్పటికి అద్దాలు పగిలిఉండటం, గాజు పెంకులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో పంచాయతీ కార్యదర్శి బి. సుబ్బారావు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిత్య కృషితోనే విజయ సాధన



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణల్లో విద్యార్థుల ఆలోచనలు విజయం సాధించే వరకు నిత్యం కృషి చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను బెంగుళూరుకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా కాగ్నిటివ్ డేటా సైంటిస్ట్ దాసరి నేహకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు వాటి ప్రాధాన్యత, ఉపాధి అవకాశాలను వివరించారు. కళాశాల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణలను గురించి సమాజాభివృద్ధికి ఉపయోగకరంగా ఆలోచన చేయాలని తెలిపారు. నేహకృష్ణ మాట్లాడుతూ యంత్రాలు, వస్తువులు, వివిధ నూతన పరికరాలకు వాటి డిజైన్ విశేష ఆకర్షణగా నిలవాలని సూచించారు. నూతన ఆవిష్కరణల నమూనాల తయారీలో రూపొందించే డిజైన్ ప్రాథమిక అంశంతో పాటూ విజయానికి ప్రాధాన్యత సంతరించుకుంటుందని తెలిపారు. ఇన్నోవేషన్ హబ్‌గా భారత దేశాన్ని నిర్మించాలనే దృఢ సంకల్పంతో విద్యార్థుల ఆలోచన ఉండాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ ఎస్. రాధిక, డాక్టర్ కె. కార్తీకపవన్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

